
సాక్షి
ఒడిశా

బుధవారం । 6 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,00,699లు, బంగారం 4గ్రాము 200 మిల్లీగ్రాములు, వెండి 18 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భళా.. సైకత కళ

కోణార్క్ పండగ-2023 నిర్వహణలో భాగంగా చంద్రభాగ తీరంలో 13వ అంతర్జాతీయ సైకత కళ ప్రదర్శన ఏర్పాటు చేశారు.

- 8లో



మట్టి పరీక్షలతో రైతులకు మేలు

తరుచూ మట్టి పరీక్షలు చేయించుకోవడం వలన రైతులకు మేలు జరుగుతుందని పర్లాకిమిడి కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

చత్తీస్‌గడ్ ఫలితాలపై సమీక్షిస్తాం


- కొరాపుట్ ఎంపీ ఉల్కా



ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: చత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఫలితాలపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కా మంగళవారం తెలియజేశారు. ఆ రాష్ట్రానికి ఈయన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ఉల్కాపై నమ్మకంతో టిక్కెట్ల పంపిణీ, ప్రచారం, సర్దుబాట్లు తదితర అంశాల్లో అధిష్టానం ప్రాధాన్యమిచ్చింది. కానీ ఊహించని విధంగా కాంగ్రెస్ అక్కడ పరాజయం మూటగట్టుకోవడంతో ఉల్కా స్పందించారు. ఎన్నికల రణరంగంలో అలుపెరగని పోరాటం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తప్పులు సరిదిద్దుకొని ముందుకు వెళ్తామని ప్రకటించారు.

గంజాయి పట్టివేత



కారు నుంచి గంజాయి బయటకు తీస్తున్న పోలీసులు

జయపురం: సమితిలోని బొయిపరిగుడ పోలీసులు కారులో తరలిస్తున్న 58.2 కేజీల గంజాయిని పట్టుకున్నారని బొయిపరిగుడ పోలీసు అధికారి అనితా నాయిక్ మంగళవారం తెలియజేశారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి మంగిడి గ్రామం నుంచి మాచ్‌ఖండ్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు కారులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి మంగిడి గ్రామ సమీపంలో మాటువేశారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఒక కారు వస్తుండగా ఆపేందుకు ప్రయత్నించారు. అయితే కారు డ్రైవర్ అతివేగంగా మాచ్‌ఖండ్ జంక్షన్ వైపు దూసుకెళ్లిపోయాడు. దీంతో పోలీసులు కారును వెంబడించారు. ఇది గమనించిన కారులో వ్యక్తులు మంగిడీ ఘాట్ రోడ్డుపై కారు విడిచిపెట్టి చీకటిలో పరారయ్యారు. ఆ సమయంలో పోలీసులు ఒక రౌండ్ కాల్పులు జరిపారు. అనంతరం కారులో తనిఖీలు చేయగా 58 కేజీల 200 గ్రాముల గంజాయి బయటపడింది. దీంతో గంజాయి, కారును సీజ్‌చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు.

పాడుబడిన బావిలో యువకుడి మృతదేహం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి బలద ప్రాథమిక పాఠశాలలోని పాడుబడిన బావిలో యువకుడి మృతదేహం మంగళవారం బయటపడింది. దీంతో స్థానికులు పాడువ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే అగ్నిమాపక సిబ్బందితో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు తుభ గ్రామానికి చెందిన పురుషోత్తం మఝి(27) గా గుర్తించారు. పురుషోత్తమ్‌ను ఎవరో హత్యచేసి బావిలో పడివేశారని ఆరోపిస్తూ బంధువులు పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడి ప్యాంట్ జేబులో రెండు సెల్‌ఫోన్లు, అతడి ఆధార్ కార్డు లభించాయి. సోమవారం రాత్రి బలడాలో జరిగిన పొడామార ఉత్సవానికి మృతుడు వెళ్లాడని అతని తండ్రి మంగళ మఝి తెలియజేశారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంటిలో ఉండిపోయి ఉంటాడని అనుకున్నామని కన్నీరుమున్నీరు అయ్యారు. అయితే పురుషోత్తమ్ ఆ ప్రాంతానికి తరుచూ వెళ్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. అతని వద్ద లభించిన రెండు సెల్‌ఫోన్లలో ఒకటి మహిళదిగా పోలీసులు గుర్తించారు. అందువలన అతడిది హత్య అనే అనుమానానికి మరింత బలం చేకూరింది. ఇది ప్రేమ వ్యవహారానికి సంబంధించినదని పోలీసులు అనుమానిస్తున్నారు. కొరాపుట్ నుంచి పోలీసు జాగిలాలు, క్లూస్ టీమ్ వచ్చి దర్యాప్తులో చేరాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.

వానా.. హైరానా

- మిచాంగ్ ప్రభావంతో జోరుగా వర్షాలు
- గంజాంలో పోటెత్తుతున్న వాగులు



బుగడా కాలనీలో వరద నీటి ప్రవాహం



కవిసూర్యనగర్‌లో వరద నీటిని దాటుకుంటూ వస్తున్న ప్రజలు





వరద నీటిని దాటుకుంటూ వస్తున్న గ్రామస్తులు



అస్కా మెయిన్ రోడ్డులో ముంచెత్తిన వాన

అవిభక్త గంజాం జిల్లాలో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రూశికుల్యా నదితో పాటు చుట్టుపక్కల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా గ్రామాలతో పాటు నగర వీధులు, కాలనీలు జలమయమయ్యాయి. కవిసూర్యనగర్, పురుషోత్తపురం, బుగడా సమితి పరిధిల్లో లోతట్టు గ్రామాల్లోకి వర్షపు నీరుచేరి ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. రోడ్లపై పలుచోట్ల నీరునిల్వ అవ్వడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

– బరంపురం



బగువ ఏరుకి గండ్లు పడి ప్రవహిస్తున్న వరద నీరు

మహిళలపై నేరాలు తగ్గుముఖం

- సైబర్ నేరాలు 24 శాతం వృద్ధి
- పిల్లలపై నేరాల్లో 3వ స్థానంలో రాష్ట్రం
- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే 2022 సంవత్సరంలో మహిళలపై నేరాలు తగ్గాయని జాతీయ నేరాల రికార్డు బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వార్షిక నేర నివేదికలో వెల్లడించింది. 2022 సంవత్సరంలో మహిళలపై నేరాలు కింద 23,648 కేసులు నమోదయ్యాయి. అంతకుముందు 2021లో 31,352, 2020 సంవత్సరంలో 25,489 కేసులు నమోదయ్యాయి. వీటిలో 263 వరకట్న మరణాలు, 14 అత్యాచారం, హత్య కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో 4 యాసిడ్ దాడులు, ఒక యాసిడ్ దాడి విఫల ప్రయత్నం కేసు నమోదయ్యింది. 2022 సంవత్సరంలో జాతీయ స్థాయిలో మహిళలకు వ్యతిరేకంగా నేరాల జాబితాలో రాష్ట్రం 4వ స్థానంలో నిలిచింది. తొలి 3 స్థానాల్లో హర్యానా (118.7), తెలంగాణ (117), రాజస్థాన్ (115.1) ఉన్నాయి. అయితే రాష్ట్రంలో సమగ్ర నేరాలు పెరిగాయి. వరుసగా గత రెండేళ్లలో 2021లో 1,55,420, 2020లో 1,34,230 నేరాల కేసులు నమోదు కాగా, 2022 సంవత్సరంలో 1,78,190 కేసులు నమోదు కావడంతో మొత్తం నేరాల సంఖ్య పెరిగింది.

చిన్నారులపై పెరిగిన కేసులు

పిల్లలకు వ్యతిరేకంగా నేరాల కేసులు 2022లో 8,240కి పెరిగాయి. ఈ వర్గం కింద 2021లో 7,899, 2020లో 6,330 కేసుల నమోదయ్యాయి. రాష్ట్రంలో కిడ్నాప్, అపహరణ కేసులు కూడా పెరిగాయి. 2022లో ఈ కేసులు 5,854 నమోదయ్యాయి. పిల్లల కిడ్నాప్, అపహరణల రేటులో 12.7 శాతంతో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచింది. తొలి 2 స్థానాల్లో హర్యానా (13), అస్సాం (12.8) నిలిచాయి.

హత్యలు తగ్గుముఖం

రాష్ట్రంలో హత్యలు తగ్గుముఖం పట్టాయి. 2022లో ఈ వర్గం కింద 1,379 కేసులు నమోదయ్యాయి. 2021లో 1394, 2020లో 1,470 హత్యా కేసులు నమోదయ్యాయి. వ్యక్తిగత శత్రుత్వం కారణంగా 106 హత్యలు జరగగా, వరకట్నం కారణంగా 252, ప్రలోభం కారణంగా 25, ప్రేమ వ్యవహారాల కింద 68 హత్యలు జరిగినట్లు నివేదిక విశ్లేషించింది. మరోవైపు రాష్ట్రంలో 2022లో 8 రాజకీయ హత్యలు జరగగా, వివిధ వివాదాల కారణంగా మరో 688 హత్యలు జరిగాయి. అయితే 2021 సంవత్సరంతో పోలిస్తే 2022లో సైబర్ నేరాలు 24 శాతం పెరగడం ఆందోళనకరం. ఇతర వర్గాల నేరాలు – ఆర్థిక నేరాలు 11 శాతం, సీనియర్ సిటిజన్లపై నేరాలు 9.3 శాతం, పిల్లలపై 8.7 శాతం, షెడ్యూల్డ్ కులాలపై 13.1 శాతం, షెడ్యూల్డ్ తెగలపై కేసుల్లో 14.3 శాతం పెరుగుదల నమోదైంది.

పొంకాలుగుడ ప్రాంతంలో పెద్దపులి




పొంకాలుగుడలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ సిబ్బంది

రాయగడ: మునిగుడ అటవీ ప్రాంతంలో కనిపించిన పెద్దపులి మరోసారి తన గమ్యాన్ని మార్చుకుంది. ప్రస్తుతం పొంకాలుగుడ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. పులి ఆచూకీని కనిపెట్టేందుకు ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 7 సీసీ కెమెరాలు అమర్చిన అధికారులు, తాజాగా మరో 4 ఏర్పాటు చేశారు. రోజుకో ప్రాంతంలో సంచరిస్తున్న పులి అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికి ముప్పుతిప్పలు పెడుతోంది. మహారాష్ట్ర అడవుల నుంచి ఇక్కడికు వచ్చిన పులికి ఈ ప్రాంత అడవులు కొత్త కావడంతో ఎటు వెళ్లాలో తెలియక ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది.

కొత్త జిల్లాకు కసరత్తు

- పదంపూర్ జిల్లా ఏర్పాటు ప్రక్రియ ఆరంభం



పదంపూర్ మ్యాప్

భువనేశ్వర్: కొత్తగా పదంపూర్ జిల్లా ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి భూమి గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. బర్‌గఢ్ పదంపూర్ సబ్–డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసే ప్రక్రియలో స్థల సేకరణ కోసం మరో అడుగు ముందుకు పడింది. కలెక్టర్ కార్యాలయానికి అనువైన స్థలాలను గుర్తించేందుకు రెవెన్యూ డివిజినల్ కమిషనర్ (ఉత్తర) సురేష్ చంద్ర దొలై మంగళవారం పదంపూర్‌లోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఆర్డీసీ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ కలెక్టర్ కార్యాలయం స్థలం ఎంపిక ప్రక్రియలో పాల్గొంది. ఆర్డీసీ పర్యటనలో స్థానిక సబ్ కలెక్టర్, తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)లు ఉన్నారు.

5 ఎకరాల విస్తీర్ణంలో కార్యాలయం

ప్రతిపాదిత పదంపూర్ జిల్లా ప్రధాన కార్యాలయం కోసం స్థలాన్ని పరిశీలించిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు దొలై తెలిపారు. ఈ నేపథ్యంలో మూడు స్థానాలను గుర్తించారు. ఒక్కో ప్లాటు ఐదు ఎకరాలు విస్తీర్ణం ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పదంపూర్ సబ్ డివిజన్‌కు వచ్చే ఏడాదిలోపు జిల్లా హోదా వస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. పదంపూర్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఈ వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా ఝొరొబొందొ ప్రాంతంలో జరిగిన బహిరంగ సభలో ఫిబ్రవరి 19న ఏడాదిలోగా పదంపూర్ కొత్త జిల్లాగా ఆవిర్భవిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లా హోదా కావాలనేది పదంపూర్ వాసుల చిరకాల కోరిక. పదంపూర్ సబ్ డివిజన్‌లో 6 మండలాలు, 6 తహసీల్‌లు, 2 నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ ఉన్నాయి. అలాగే సుమారు 6.7 లక్షల జనాభా ఉంది. జిల్లా హోదా డిమాండ్‌పై పలు సంస్థలు వివిధ సందర్భాల్లో ఆందోళనలకు దిగాయి.

• భయం వద్దు.. భద్రంగా ఉందాం



మిచాంగ్ తుపాను తీరం దాటుతున్న తరుణంలో ప్రజలు భయాందోళనలకు గురి కాకుండా భద్రంగా ఉండాలని సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పూరీ సాగర తీరంలో తీర్చిదిద్దిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

- భువనేశ్వర్/పూరీ

శ్రామిక సమావేశాన్ని జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ సమన్వయ కమిటీ పిలుపు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జయంతి దాస్

జయపురం: రాష్ట్రంలో శ్రామికుల సమస్యలపై రాజధాని భువనేశ్వర్‌లో ఈనెల 16వ తేదీన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నిర్వహించనున్న విశాల శ్రామిక సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి జయంతి దాస్ పిలుపునిచ్చారు. స్థానిక కార్మిక భవనంలో శ్రామిక నేత ఉత్తమ కుమార్ అధ్యక్షతన కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, నవరంగపూర్ జిల్లాల సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాల వలన జయపురంలో సేవా పేపరు మిల్లు లాంటి అనేక ఖర్మాగారాలు మూతపడుతున్నాయని, తద్వారా వేలాదిమంది శ్రామికులు రోడ్డున పడి ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సమాజానికి సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆశవర్కర్లు, మధ్యాహ్న భోజన పథకంలో వంటలు చేసే సహాయకులకు నామమాత్ర వేతనం ఇస్తున్నారని, అందువలన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే నిర్మాణ శ్రామికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వారికి కనీస వేతనం చెల్లించాలని, శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని అతిపెద్ద శ్రామిక ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశానికి ముందు అనేక మంది శ్రామికులు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ నేతలు ప్రమోద్ మహంతి, గంగాధర గౌడ, డొమయి మఝి, సనాతన సాహు, లక్ష్మీ హంతాల్, లతా ఖొర, నంద హరిజన్, సుకాంత గౌడ, సావిత్రి మఝి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాటర్ ట్యాంక్ పైనుంచి పడి వ్యక్తి మృతి


బన్‌సింగ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తెంతులిగుమ్మ పంచాయతీలో నిర్మాణంలో ఉన్నటువంటి వాటర్ ట్యాంక్ పైనుంచి పడి కూలీ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సాహిద్ లక్ష్మణ్ నాయక్ పేరున ఆయన స్వగ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతోంది. నిర్మాణ పనుల్లో భాగంగా పనిచేస్తున్న కూలీ ట్యాంక్ పైనుంచి కాలు జారి కిందపడి మృతి చెందాడు. మృతుడు నవరంగ్‌పూర్ జిల్లా కస్తుముండ గ్రామానికి చెందిన బన్‌సింగ్ హరిజాన్(23)గా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి మత్తిలి ఆరోగ్య కేంద్రానికి మృతదేహాన్ని తరలించారు.

'గజపతి జిల్లాకు ముప్పు లేదు'


వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారడంతో కోస్తా ప్రాంతాల్లో ప్రభావం చూపింది. దీంతో మంగళవారం పర్లాకిమిడి, కాశీనగర్, గుమ్మా, నువాగడ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అయితే తుపాను బలహీనపడడంతో గజపతి జిల్లాకు ముప్పు తప్పిందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలియజేశారు. కాశీనగర్‌లో 7 మి.మీ, పర్లాకిమిడిలో 10.4 మి.మీ, గుసానిలో 7 మి.మీ, రాయఘడలో 9 మి.మీ, గుమ్మాలో 9 మి.మీ, నువాగడలో 11.4 మి.మీ, ఆర్.ఉదయగిరిలో 7.2 మి.మీ, మోహానాలో 7 మి.మీ వర్షం కురిసినట్లు వెల్లడించారు.

కుటుంబం చెంతకు బాలుడు

కాశీబుగ్గ: అదృశ్యమైన బాలుడు ప్రత్యక్షమైన ఘటన మంగళవారం పలాసలో చోటుచేసుకుంది. కంచిలి మండలం టి.శాసనం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి కన్నా బెహరా సోమవారం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బృందాలుగా వీడి పలు ప్రాంతాల్లో వెతికారు. ఎట్టకేలకు మంగళవారం పలాస రైల్వే స్టేషన్‌లో బాలుడు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కంచిలి పోలీసులకు విషయం తెలియజేసి అనంతరం ఇంటికి చేరుకున్నారు.

బైక్ దగ్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ లక్ష్మిడిపేటలో సీపాన రామ్మోహన్‌రావుకు చెందిన ద్విచక్ర వాహనం(హీరో స్ప్లెండర్ ప్రో) దగ్ధమైంది. మంగళవారం తన ఇంటి వద్ద బైక్ స్టార్ట్ చేయగా కేశవరావుపేట రోడ్డులో ఆగిపోయింది. మళ్లీ స్టార్ట్ చేసి వెళ్తుండగా పొగ రావడంతో బైక్ నిలిపి వేసి స్టాండ్ వేశాడు. ఒక్కసారిగా పెంట్రోల్ ట్యాంకు నుంచి మంటలు వచ్చి బైకు మొత్తం కాలిపోయింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు చెప్పాడు.

కొండపేటలో వరికుప్పలు దగ్ధం

సరుబుజ్జిలి: బూర్జ మండలం పెద్దపేట పంచాయతీ కొండపేటలో పాలక శంకరయ్యకు చెందిన సుమారు 5 ఎకరాల వరికుప్పలు సోమవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. చుట్టూ వరికుప్పలు ఉన్నా ఈ కుప్ప మాత్రమే దహనం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. పంటనష్టం సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనావేశారు. బాధిత కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో మంగళవారం గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టికెట్ కౌంటర్ వద్ద సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఓ మహిళ మరుగుదొడ్ల శుభ్రతకు వినియోగించే యాసిడ్ బాటిల్ తాగి పడిపోయింది. వెంటనే స్థానికులు ఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు పలాస ఆర్‌పీఎఫ్ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

పీఎంజేఏవై సేవలపై అవగాహన

పాతపట్నం: ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జన ఆరోగ్యయోజన(పీఎంజేఏవై)ను వినియోగించుకోవాలని బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు బూరగాంలో పథకం ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ రెండో భాగంగా ఈ పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు.

భళా.. సైకత కళ


శ్రీరామ చంద్రునికి శబరి ఆతిథ్య సైకత శిల్పం

కోణార్క్ పండగ–2023 నిర్వహణలో భాగంగా చంద్రబాగ తీరంలో 13వ అంతర్జాతీయ సైకత కళ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పలువురు లండన్, స్పెయిన్, జపాన్ వంటి ప్రపంచ దేశాల నుంచి విచ్చేసిన అంతర్జాతీయ సైకత కళాకారులు, జాతీయ, స్థానిక కళాకారులు అత్యంత ఉత్సాహంతో పాలుపంచుకుంటున్నారు. ప్రత్యేక శీర్షికలతో తీర్చిదిద్దుకున్న సైకత కళాఖండాలు సందర్శకులు, పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. అతిథి దేవోభవ ఇతివృత్తంగా రూపుదిద్దుకున్న సైకత కళాఖండాల్లో భారతీయ సంప్రదాయ విలువలు, మానవీయ విలువలు, ఆత్మీయ అనురాగాలకు అద్దం పడుతున్న సైకత కళాకృతులతో చంద్రబాగ తీరం కొత్త కళని సంతరించుకుంది.

– భువనేశ్వర్


శ్రీజగన్నాథుని సైకత శిల్పం


సుదామ–శ్రీకృష్ణ ఆతిథ్య సైకత శిల్పం

శివోహం



పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని జాజ్‌పూర్ ఉత్తరాది వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థాన సముదాయంలో ప్రత్యేక లింగార్చన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకత లింగం తీర్చిదిద్ది భక్తులు 108 ప్రమిదలతో అష్టోత్తర శత దీపార్చనలో పాలు పంచుకున్నారు. – భువనేశ్వర్

మట్టి పరీక్షలతో రైతులకు మేలు


రాయగడ: వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: తరుచూ మట్టి పరీక్షలు చేయించుకోవడం వలన రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ మట్టి దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మట్టి సంరక్షణ, ఒడిసిపట్టిన నీరు అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఎనిమిది మంది రైతులకు మట్టి సంరక్షణకు సాయిల్ కార్డులను అందజేశారు. జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి బలరాం సుబుద్ధి పర్యవేక్షించిన కార్యక్రమంలో మట్టి సంరక్షణ, చెక్ డ్యాంల ప్రాజెక్టు అధికారి సురేష్ కుమార్ పట్నాయక్, సబ్ డివిజనల్ ప్రాణిచికిత్సాధికారి డాక్టర్ రమాకాంత రోణా, జిల్లా మత్స్య అధికారి లిసా బెహరా, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సేంద్రీయ వ్యవసాయంతో మేలు

రాయగడ: సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యానికి, నేలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ముఖ్య వ్యవసాయ శాఖ అధికారి మనోజ్ కుమార్ ప్రధాన్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రపంచ మట్టి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుచూ వాతావరణ మార్పులతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే నేల సారవంతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల సకాలంలో మట్టి పరీక్షలు చేయించుకోవాలని, సేంద్రీయ వ్యవసాయాన్ని అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయా మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, వాటర్ షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దయానిధి బాగ్ తదితరులు పాల్గొన్నారు.

• కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్


పర్లాకిమిడి: బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో అధికారులు

మిషన్ శక్తితో మహిళల ఆర్థికాభివృద్ధి


బక్షీపాత్రోకు స్వాగతం పలుకుతున్న మహిళలు

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ శక్తి కార్యక్రమంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని మిషన్ శక్తి రాష్ట్ర శాఖ సలహాదారు లోపముద్ర బక్షీపాత్రో అన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఆమెకు స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. గుణుపూర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటించి మిషన్ శక్తి మహిళలతో మాట్లాడారు. అగరుబత్తిలు, టైలరింగ్ యూనిట్లను నిర్వహిస్తున్న స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలతో మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని తెలియజేశారు. ముఖ్యంగా వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి కోసం స్వయం ఉపాధి పనులు చేపట్టి కుటుంబానికి అండగా నిలుస్తుండడం గర్వంగా ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం గుణుపూర్ సమితి కార్యాలయంలో నిర్వహించిన ఒక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి మూలమైన మిషన్ శక్తి కార్యక్రమాల్లో ఎటువంటి అవాంతరాలు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. మహిళలను అధికారులు ప్రోత్సహించాలని సూచించారు. ఆమెతో పాటు బీడీవో శుభ్రంజలి ప్రధాన్ తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లాలోని రామనగుడ, కొలనార సమితుల్లో పర్యటించారు. మరో రెండు రోజుల పాటుగా ఆమె జిల్లాలో పర్యటిస్తారు.


మాట్లాడుతున్న బక్షీపాత్రో పక్కనే బీడీవో ప్రధాన్ తదితరులు

• అలరించిన నృత్య ప్రదర్శనలు


కేరళ లాస్య అకాడమీ నృత్య ప్రదర్శన

భువనేశ్వర్: కోణార్క్ పండగ కళా ప్రియులను మైమరిపిస్తోంది. మోహినియట్టం, ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు విశేష ప్రేక్షకాదరణ పొందాయి. ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్ దీప ప్రజ్వలనతో నృత్యోత్సవం ఆరంభమైంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


ప్రశాంత్ (ఫైల్)

కొత్తూరు: మండలంలోని గులివింద లపేటకు చెందిన కోడిపాత్రుని ప్రశాంత్(20) మెట్టూరు బిట్–2 ఆర్‌ఆర్ కాలనీ వద్ద మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ అయ్యప్ప మాల ధరించాడు. మెట్టూరు బిట్–3లోని సన్నిధానం నుంచి మెట్టూరు సెంటర్‌కు నడిచి వస్తుండగా జారిపడ్డాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. అప్పటికే స్తంభానికి విద్యుత్ సరఫరా కావడం, మాలధారణ కారణంగా చెప్పులు ధరించకపోవడంతో షాక్‌కు గురైనట్లు భావిస్తున్నారు. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు ఎస్ఐ ఎంఏ అహమ్మద్ చెప్పారు. మృతుడి తల్లి రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్‌కు తల్లిదండ్రులు ధర్మారావు, రాములమ్మ, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నారు. అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి.

టెక్కలిలో యువకుడి వీరంగం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని గోపినాథపురానికి చెందిన పద్మనాభం అనే యువకుడు వీరంగం సృష్టించాడు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం లేకపోవడంతో పద్మనాభం అనే యువకుడు రెండురోజులుగా హల్‌చల్ చేస్తున్నాడు. ఈ విషయమై స్థానికులు మంగళవారం సాయంత్రం టెక్కలి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విషయం చెబుతుండగా అక్కడికి చేరుకుని దాడికి పాల్పడుతుండగా పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం బుధవారం టెక్కలి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


పర్లాకిమిడి: సంఘటన స్థలంలో పోరిచ్చా మృతదేహం


సురాజ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ 31 గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీవీ 31 గ్రామానికి చెందిన రబీన్ మానీయా(22), సురాజ్ మానీయ(19)లు ద్విచక్ర వాహనంపై పోడియ వైపుకు వెళ్తున్నారు. కాగా అదే రోడ్డులో ఒక ట్రక్కు రిపేర్ అవ్వడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. ఇది గమనించకుండా అతి వేగంతో బైక్‌పై వెళ్తున్న వీరు ట్రక్కును ఢీకొన్నారు. దీంతో ప్రమాద స్థలంలోనే సురాజ్ మృతి చెందగా, రబీన్‌కు తీవ్ర గాయలయ్యాయి. విషయం తెలిసిన కలిమెల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయాలైన రబీన్‌ను ప్రథమ చికిత్స అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సురాజ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మరో ప్రమాదంలో...

పర్లాకిమిడి: గుసాని సమితి కంట్రగడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ప్రైవేటు ఉద్యోగి దుఃఖిశ్యాం పోరిచ్చా (45) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం పర్లాకిమిడి నుంచి రాయఘడకు బైక్ మీద వెళ్తున్న దుఃఖిశ్యాం పోరిచ్చాను ఎదురుగా వస్తున్న మ్యాక్సీ పికప్ ఢీకొనడంతో సంఘటన స్థలంలో మృతి చెందాడు. మృతుడు గంజాం జిల్లా మసాబడి గ్రామానికి చెందిన వాడిగా గురండి పోలీసు అధికారి రవీంద్ర పాత్రో గుర్తించారు. పోలీసులు పర్లాకిమిడి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ట్రక్కును బైక్ ఢీకొన్న దృశ్యం

తైక్వాండో పోటీల్లో పతకాల పంట


తైక్వాండో ఆఫ్ ఇండియా ప్రతినిధులతో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ తైక్వాండో పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు హవా కనబర్చారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా ఈ నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఆలిండియా సబ్–జూనియర్స్, క్యాడెట్స్ బాలబాలికల తైక్వాండో చాంపియన్ షిప్–2023 పోటీలు జరిగాయి. ఇందులో క్యాడెట్ అండర్–33 విభాగంలో కారె మోక్షిత్ రజతం, అండర్–37 విభాగంలో తాన్ని ఢిల్లేశ్వర రావు కాంస్యం, బాలికల అండర్–26 విభాగంలో పెద్దింటి యశిత స్వర్ణం, దువ్వ త్రివేణి కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. వీరిని తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రభాస్ కుమార్‌శర్మ, న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుతరెడ్డి మంగళవారం అభినందించారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్ రావు, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, తైక్వాండో కోచ్ కురిటి తారకరామ, కొమర మోహన్ కృష్ణ, రెడ్డి సాయిరాం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రైనీ బీఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య

సంతబొమ్మాళి: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన ట్రైనీ బీఎస్ఎఫ్ జవాన్ మోడి మధురెడ్డి (23) మంగళవారం జమ్ముకాశ్మీర్‌లో ట్రైనింగ్ సెంటర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మధురెడ్డి బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికై మూడు వారాలుగా శిక్షణ పొందుతున్నాడు. మంగళవారం ఉదయం శిక్షణకు రాకపోవడంతో తోటి జవాన్లు వెళ్లి చూడగా గదిలో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడన్న కొడుకు అనంతలోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఈశ్వరరావు, ఆదిలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మధురెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పోరాట యోధుడు పాణిగ్రాహి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి జీవితం నిత్య పోరాట చైతన్యమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళా మండలి రాష్ట్ర సహాయక కార్యదర్శి కొర్రాయి నీలకంఠం చెప్పారు. పలాస మండలం బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద మంగళవారం పాణిగ్రాహి వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న సుబ్బారావు పాణిగ్రాహి సంస్మరణ సభ బొడ్డపాడులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరుణోదయ, ప్రజా కళామండలి కళాకారులతో ఆటా పాట కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవులు, సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు పి.అరుణ, అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, నిశితాసి, కుత్తుం ఢిల్లీరావు, ప్రజా కళాకారుడు కుత్తుం వినోద్, జి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

250 మద్యం సీసాల పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలు

బలిజిపేట: అక్రమంగా తరలిస్తున్న 250మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నారాయణపురం గ్రామానికి చెందిన ఎస్.తిరుపతిరావు బలిజిపేట-పదమాయవలస రహదారిలో నారాయణపురం రోడ్డు జంక్షన్ వద్ద మద్యం సీసాలు పట్టుకుని ఉండడం గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని తిరుపతిరావుపై కేసు నమోదుచేశారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్రీధర్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో మంగళవారం జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి గాపడ్డాడు. దీనిపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. బంగారమ్మ కాలనీలో నివాసముంటున్న పి.శ్రీధర్ పట్టణంలోని ఆర్‌ఓ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనాన్ని ప్రతిరోజూ ఇంటిముందు పార్కింగ్ చేస్తాడు. అదే వీధిలో నివాసం ఉంటున్న తుమరాడ కిరణ్ ఆటో నడుపుతూ ప్రతిరోజూ అదే దారిలో వస్తుంటాడు. తన ఇంటి ముందు బైక్ ఉండడంతో ఆటో హార్న్ కొడుతున్నాడు. ఆ సమయంలో శ్రీధర్ భోజనం చేస్తున్న సందర్భంగా బయటకు వచ్చి బైక్‌ను పార్కింగ్ నుంచి తీయడానికి సమయం పట్టింది. ఆలస్యంగా వచ్చిన కారణంగా ఆటో డ్రైవర్ కిరణ్ శ్రీధర్‌ను రాడ్డుతో కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోముఖి నదిలో పడి వృద్ధురాలి మృతి



పారమ్మ(ఫైల్)

మక్కువ: మండలంలోని పాత లోవరకండి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఒప్పంగి పారమ్మ (74) గోముఖి నదిలో పడి మంగళవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఎస్సై జి.పైడిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డి.శిర్లాం గ్రామం సమీపంలో గోముఖి నదిలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, ఎస్సై పైడిరాజు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాల పంటలో నీరుండకూడదు

- ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్



జొన్న పంటలో చేరిన వర్షపు నీరు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల పంట పొలాల్లో నీరు లేకుండా చూడాలని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్ సూచించారు. మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వివిధ రకాల పంట పొలాల్లో నీరు చేరిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన మంగళవారం విపులంగా తెలియజేశారు. జాగ్రత్తల గురించి ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. జొన్న పంట పూత, గింజ ఏర్పడే దశలో ఉన్నప్పుడు బూజు తెగులు రాకుండా ప్రొపైకొనజోల్ మందు లీటరు నీటికి 0.5 మి.లీ చొప్పున కంకులపై రెండుసార్లు వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. జొన్న పంట కోసి పొలాల్లో ఉన్నప్పుడు లీటరు ఉప్పుడు ద్రావణం 20 గ్రాములు కలిపి కోసిన పంట కంకులపై వెదజల్లడం ద్వారా బూజు, కంకిపై గింజలు మొలక రాకుండా నివారించడానికి అవకాశం ఉంటుంది. పంట పొలంపైన వాలిపోయినప్పుడు, మొక్కలను పైకి జరిపి గుంపుగా నిలబెట్టుకుని కాపాడుకోవాలి. రాగి, కొర్ర పంటలలో అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి కార్బన్డిజం ఒక గ్రాము కలిపి మొక్క బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

వేరుశనగ

కోతకు సిద్ధంగా ఉన్న వేరుశనగ పంటను వర్షాలకు ముందు పీకరాదు. కాయలు వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. పొలంలో నిలిచి ఉన్న నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి.

ఉద్యాన పంటలు

జీడిమామిడి, మామిడి లేత తోటల్లో మొక్కలకు ఊతం ఇవ్వాలి. వేరు కుళ్లు రాకుండా లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు కలిపి మొక్కల మొదలు తడపాలి. గాలికి దెబ్బతిన్న, వాలిపోయిన విరిగిన కొమ్మలను ఏటవాలుగా కోసి ఒక శాతం బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పూయాలి. పూత బయటికి వచ్చిన తోటలో శిలీంధ్రం తెగులు ఉధృతి కనిపించిన వెంటనే లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజమ్ కలిపి పిచికారీ చేయాలి.

కొబ్బరి తోటలో

తిరగబడిన, సగం విరిగి వేలాడుతున్న ఆకులను కత్తిరించాలి. ఇసుక నేలలో ఈసమయంలో గానోడెర్మా తెగులు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు ట్రైకో డెర్మా విరిడే 100 గ్రాములు, రెండు కిలోల వేపపిండి, 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి మొక్కల పాదులలో వేసుకోవాలి. పోషకలోప నివారణకు 500 గ్రాముల యూరియా, ఒక కిలో సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, ఒక కిలో మ్యురేట్ ఆఫ్ పొటాషియం బూస్టర్ ఒక్కో చెట్టుకు వేయాలి.

పదోన్నతి ఉత్తర్వులు అందజేత



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయం పరిధిలో ఇద్దరు రికార్డు అసిసెంట్లను జూనియర్ అసిస్టెంట్లుగా, ఇద్దరు కార్యాలయ సహాయకులకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

భామిని: మండలంలోని బిల్లుమడ సెంటర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వాహన చోదకులకు గాయాలయ్యాయి. ఏబీ రోడ్డుపై వెళ్తున్న స్కూటీని గురండి నుంచి భామిని వెళ్తున్న బైక్ ఢీకొనడంతో ఇద్దరూ గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో మూలగూడకు చెందిన చిన్నారావు, బిల్లుమడకు చెందిన అనంతరావులు గాయపడగా రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. క్షతగాత్రులను గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భామిని పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవల అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు బాధితుల కుటుంబసభ్యులు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రాథమిక కీ విడుదల

పార్వతీపురంటౌన్: ఈనెల 3వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ప్రాథమిక కీ విడుదల చేసినట్లు డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 1413మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా వారిలో 1375మంది (97) శాతం హాజరయ్యారని తెలిపారు. ప్రాథమిక కీని ఈనెల 4వ తేదీన విడుదల చేసి కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యాడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఉంచారన్నారు. ఈ ప్రాథమిక కీ విషయంలో అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కార్యాలయం వెబ్‌సైట్‌లో గల గ్రీవెన్స్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రామచంద్రాపురంలో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న జేడీ వీటీ రామారావు

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావం వల్ల నూర్పు చేపట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ప్రభుత్వం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన దత్తిరాజేరు మండలంలోని రామచంద్రాపురం, ఎస్ చింతలవలస గ్రామాల్లో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 300 క్వింటాళ్ల ధాన్యాన్ని పరిశీలించారు,వెంటనే ఆయా రైతులు వద్ద పత్రాలు తీసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి పెదమానాపురం వద్ద ఉన్న శ్రీసత్య మోడ్రన్ రైస్ మిల్లుకు తరలించారు. భారీ వర్షంలో కూడా అధికారులు తమ వద్దకు వచ్చి మద్దతు ధర ఇచ్చి ధాన్యం తీసుకెళ్లడంతో రైతులు ఆనందపడ్డారు. ఏడీఏ మహారాజన్, ఏఓ గోవిందమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దన్నాన త్రినాథరావు వీఏఏ రాము జేడీ వెంట ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ

బొండపల్లి: తుపాను ప్రభావంతో వరి నూర్పులు చేసి ధాన్యం సిద్ధంగా ఉన్న రైతుల నుంచి నేరుగా ఆఫ్‌లైన్‌లో సేకరించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ జిల్లా జేడీ వీటీ రామరావు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని గరుడుబిల్లి, కనిమెరక గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ధాన్యం పరిశీలించి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ , ఏఓ పి.వి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

7న ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక

- రాజకీయ పార్టీలతో సమావేశం

పార్వతీపురం:

ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు ఈనెల 7న వస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు ఎన్నికల రోల్ అబ్జర్వర్ సమావేశం నిర్వహిస్తారన్నారు. రోల్ అబ్జర్వర్ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో భాగంగా సూచనలు, సలహాలు,, ఫిర్యాదులను రోల్ అబ్జర్వర్ స్వీకరిస్తారని పేర్కొన్నారు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

- ఆధునిక పద్ధతిలో పెంపకంపై శాస్త్రవేత్తల సహకారం
- రైతులకు ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్స్‌ల అందజేత



కోళ్లను పెంచే డూప్లెక్స్



పరిశోధన స్థానంలో పెంచుతున్న కోళ్లు



చిన్న పిల్లలను పెంచడానికి రుపొందించిన బ్రూడర్



గుడ్లు పొదిగే ఇంక్యుబేటర్

విజయనగరం ఫోర్ట్: పూర్వకాలంలో ప్రతి రైతు కళ్లం వద్ద, ఇంటి వద్ద నాటు కోళ్లను పెంచేవారు. దీని వల్ల రైతులకు అదనపు ఆదాయం వచ్చేది. కానీ ఇప్పుడు అతి కొద్ది మంది మాత్రమే కోళ్లను పెంచుతున్నారు. గ్రామాల్లో అధికంగా కనిపించే నాటు కోళ్లు ఇప్పుడు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక పద్ధతిలో నాటు కోళ్ల పెంపకం చేపట్టడానికి వేలాది రుపాయల విలువ చేసే అవసరమైన పరికరాలను రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.

ఇంక్యుబేటర్, బ్రూడర్ల అందజేత

నాటుకోళ్లను పెంచుకునేందుకు రైతులకు ఇంక్యుబేటర్లు, బ్రూడర్లు, డూప్లెక్స్‌లను అందజేస్తున్నారు. గుడ్లు పొదిగే మిషన్ ఇంక్యుబేటర్. కోడి పిల్లలను పెంచుకునే పరికరం బ్రూడర్. డూప్లెక్స్‌లో పెద్ద కోళ్లను పెంచుకోవచ్చు.

సమీకృత వ్యవసాయ విధానం ప్రాజెక్టులో అందజేత

సమీకృత వ్యవసాయ విధానం ప్రాజెక్టులో ఉన్న రైతులకు ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్స్‌లను అందజేస్తున్నారు. ఇంక్యుబేటర్ విలువ రూ.12 వేలు. ఇటువంటి ఇంక్యుబేటర్లు 10 మంది రైతులకు అందజేశారు. డూప్లెక్స్ విలువ రూ.25 వేలు. వాటిని 36మంది రైతులకు అందజేశారు. అలాగే బ్రూడర్ విలువ రూ.12 వేలు. 10మంది రైతులకు బ్రూడర్లు అందజేశారు.

ఆధునిక పద్ధతిలో కోళ్ల పెంపకం

సాధారణ పద్ధతిలో కోళ్ల పెంపకం అపరిశుభ్రంగా ఉంటుంది. కోళ్ల మల విసర్జన వల్ల దుర్వాసన వెదజల్లుతుంది. గుడ్లు పొదగడానికి బుట్ట కడతారు. ఇది ఇంట్లో పెట్టడం వల్ల కూడా దుర్వాసన వస్తుంది. ఈనేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో కోళ్లను పెంచడం కోసం ఇంక్యుబేటర్, బ్రూడర్, డూప్లెక్సులను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎం.వి.శ్రీనివాస్ రూపొందించి రైతులకు అందించారు. వాటిలో కోళ్ల పెంపకం చేపట్టి రైతులు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది.

నేడు జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీఓ, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్ లో రిలేషన్‌షిప్ మేనేజర్, సోలార్ యాక్టివా సైన్సెస్ కంపెనీలో ప్రొడక్షన్ టెక్నీషియన్, మెడ్ప్లస్ ఫార్మసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, ఆడిట్ అసిస్టెంట్, ఇండస్లో టెక్నీషియన్, ఆపరేటర్, ఇసుజు మోటార్స్, సియాన్ ఇ-హెచ్ డబ్ల్యుఏ సుమిత్, శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, డి ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ- బి.టెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతంతో పాటు ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులంతా డిసెంబర్ 6న శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పార్వతీపురం వద్ద ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఇతర వివరాలకు ఫోన్ 9440127517, 8297400777 నంబర్స్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వికాస జాబ్స్.కామ్‌లో సంప్రదించాలని సూచించారు.

ఫెన్సింగ్ పోటీలు విజయవంతం చేయండి

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన జెడ్పీ ఛైర్మన్



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: జిల్లా వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఫెన్సింగ్ పోటీలను విజయవంతం చేయాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈనెల 8,9,10 తేదీల్లో విజయనగరం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 10వ సబ్‌జూనియర్స్, 9వ క్యాడెట్ బాల,బాలికల ఫెన్సింగ్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆయన జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఇటువంటి పోటీల నిర్వహణ ద్వారా మరింత మంది క్రీడల్లోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్‌కోచ్ డీవీ చారి ప్రసాద్, కోచ్‌లు పాల్గొన్నారు.

16 వరకు కోరుకొండ ప్రవేశ పరీక్ష ఫీజు గడువు

పార్వతీపురం టౌన్: విజయనగరం జిల్లాలో గల కోరుకొండ సైనిక పాఠశాలలో 2024-25 విద్యాసం వత్సరానికి 6,9 తరగతుల్లో ప్రవేశానికి జనవరి 21 నిర్వహించనున్న పరీక్షకు ఫీజు చెల్లించడానికి ఈనెల 16వ తేదీ సాయంత్రం వరకు గడువు ఉందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాధారణ, డిఫెన్స్, మాజీ సైనికులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు రూ.650, షెడ్యూల్ కులం, షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థులు రూ.500లు పరీక్ష ఫీజు ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా డెబిట్, క్రెడిట్‌కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: బైక్ చోరీకి పాల్పడిన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు విలేకరుల సమావేశం నిర్వహించిన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక తిరుమల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన మీసాల తాత నాయుడు తన గ్లామర్ మోటార్ బైక్‌ను ఆస్పత్రి వద్ద పార్కు చేసిచికిత్స చేయించుకుని అనంతరం తిరిగి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాగవంశం వీధి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై నరేష్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు

- ఇద్దరిని విధుల నుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌ఓ ఉత్తర్వులు

విజయనగరం ఫోర్ట్: నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందిన ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. 2020 ఆగస్టు 29న వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్లుగా తురక కరుణప్రకాష్, కోరాడ సంతోష్ కుమార్ (కాంట్రాక్టు పద్ధతిపై)ఉద్యోగాలు పొందారు. ఘోష ఆస్పత్రిలో ఒకరు, ఫైలేరియా విభాగంలో ఒకరు విధుల్లో చేరారు. వీరిద్దరు నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినట్టు అందిన ఫిర్యాదు మేరకు పారామెడికల్ బోర్డుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పంపించారు. బోర్డు అధికారులు వీరి సర్టిఫికెట్స్ నకిలీవిగా ధ్రువీకరించడంతో ఇరువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు. నోటీస్ ఇవ్వకుండా ఉద్యోగాలు తొలగించడంపై ఇద్దరు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించడం, కోర్టు తీర్పు మేరకు ఈ ఏడాది జూన్ 23 మళ్లీ ఉద్యోగాల్లో నియమించారు. అయితే, దీనిపై విచారణ చేయాలని పార్వతీపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వైద్యవిభాగం ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆయన విచారణలో సర్టిఫికెట్స్ మార్ఫింగ్ చేసినట్టు తేలడంతో ఇద్దరినీ విధుల నుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌ఓ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

బొబ్బిలిలో మెగా జాబ్ మేళా

బొబ్బిలి: ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న బొబ్బిలిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్లేస్‌మెంట్స్ జిల్లా అధికారి టి.భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, బీటెక్, ఐటీఐ తదితర కోర్సులు చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 13 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరై వివిధ ఉద్యోగాలకు యువతను ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని బొబ్బిలిలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అన్ని ధ్రువపత్రాలు, ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 79898 26953, 87905 00572, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆంధ్ర జలాశయం పరిశీలన



ఆంధ్ర జలాశయాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

మెంటాడ: మిచాంగ్ తుఫాన్‌పై అప్రమత్తం చేయడంలో భాగంగా ఆంధ్ర జలాశయాన్ని తహసీల్దార్ రామకృష్ణతో కలిసి ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మంగళవారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా ఇంతవరకు ఎక్కడా పంట నష్టం జరిగినట్టు నివేదికలు అందలేదన్నారు. రైతులను, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసరవేళ టోల్‌ఫ్రీ నంబర్‌ను 63008 51185ను సంప్రదించాలన్నారు.

తీరంలో వైద్యశిబిరాల సందర్శన



వైద్యశిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

పూసపాటిరేగ: తుఫాన్ వర్షాలు నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాలైన చింతపల్లి, బర్రిపేట గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాలను డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం గోవిందపురం పీహెచ్‌సీను సందర్శించారు. వ్యాక్సినేషన్, ప్రసూతిగది, ల్యాబ్, మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎపిడమాలజిస్టు వెంకటేష్, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది చంద్రశేఖరరాజు, సత్తిరాజు, వైద్యాధికారి కె.త్రినాథ్ ఉన్నారు.